
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

బుధవారం 6 ఆగస్టు 2025

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం

మహానంది, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈనెల 8న సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఈవో ఆలయ వేదపండితులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. అభిషేకమంటపంలో సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు దేవస్థానం పూజా సామగ్రిని అందజేస్తుందన్నారు. సమావేశంలో ఏఈవో మధు, ఇన్‌చార్జి పర్యవేక్షకుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం రాయితీ: కలెక్టర్



సర్టిఫికెట్లు పొందిన వైద్య సిబ్బందితో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్‌ట్యాక్స్ రాయితీ ప్రయోజనాలు కల్పిస్తుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ పరిశ్రమల స్థాపన కోసం 139 దరఖాస్తులు అందగా, ఆయా శాఖల ద్వారా 131 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలిన 8 పరిశ్రమలు పరిశీలనలో ఉన్నాయని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 57 ఉత్తమ ప్రమాణాలు పాటించిన ఆసుపత్రులను జాతీయ స్థాయి సర్టిఫికేషన్ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్తమ ఆసుపత్రుల్లో సదుపాయాల కోసం కృషిచేసిన 16 మంది వైద్యసిబ్బందికి కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పరిశ్రమలశాఖ జీఎం మహబూబ్‌బాషా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప



మాట్లాడుతున్న నాగేంద్రప్ప

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప అన్నారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నంద్యాల మైనర్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగులను పూర్తిగా విస్మరించారని, నేటి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదనకు గురిచేస్తోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా కేకును కట్‌చేశారు. నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, తిరుపాల్, ఫకృద్దీన్, విజయలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

నేడు డోన్‌కు వైఎస్ జగన్



డోన్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం డోన్‌కు రానున్నారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా డోన్‌కు ఆయన చేరుకుంటారు. జాతీయ రహదారి సమీపంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడి వివాహ రిసెప్షన్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొంటారు. ఈ మేరకు వెంకటాపురం ప్రధాన రోడ్డులో హెలిప్యాడ్ ల్యాండింగ్‌కు స్థలాన్ని మాజీ ఆర్థికమంత్రి బుగ్గన పరిశీలించారు. వైఎస్ జగన్ రాక నేపథ్యంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వివాహ రిసెప్షన్ అనంతరం ఆయన తిరిగి మధ్యాహ్నం బెంగళూరుకు హెలీకాప్టర్‌లో వెళ్తారు.

నాడు బస్తా రూ.4వేలు నేడు రూ.300



చాగలమర్రిలో సాగు చేసిన నిమ్మతోట

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టపోతున్నారు. మూడేళ్ల పాటు ఉపాధి నిధులతో కంటికి రెప్పలా కాపాడుకుంటూ నిమ్మ తోటలు సాగు చేసిన రైతులు నష్టాల బాట పట్టారు. నిమ్మ ధర ఒక్కసారిగా పతనం కావడంతో ఆందోళన చెందుతున్నారు. నిమ్మ ధర ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు పతనమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బస్తా నిమ్మ(800 నుంచి 900 నిమ్మకాయలు) కేవలం రూ.300 మాత్రమే పలుకుతోంది. జిల్లావ్యాప్తంగా సాగవుతున్న నిమ్మకాయలు ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీ, పూణే, చెన్నై, ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం అక్కడ కూడా ధర అంతంత మాత్రంగానే ఉంది. నిమ్మచెట్లు దిగుబడి వచ్చేలోపే తెగుళ్లు అధికమై చెట్లు ఎండిపోయాయి. దీంతో ధరలు లేక.. తెగుళ్ల బారిన పడటంతో రైతులు వాటిని తొలగించేస్తున్నారు.

- అమాంతం పడిపోయిన నిమ్మ ధరలు
- తగ్గిన సాగు విస్తీర్ణం
- తెగుళ్లతో దెబ్బతిన్న తోటలు
- నష్టపోతున్న అన్నదాతలు

చాగలమర్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిమ్మకాయల ధర రోజు రోజుకు పడిపోతోంది. నాడు నిమ్మకాయల బస్తా రూ.4వేలు ఉండగా నేడు రూ.300 దిగజారిపోయింది. కోత సమయంలో ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట దిగుబడి లేనప్పుడు ధర బాగా ఉంటుంది. కాయ చేతికొచ్చాక ధర తగ్గిపోతుంది. మార్కెట్ మాయాజాలంతో రైతులు దగా పడుతున్నారు. ధరలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. నిమ్మ ధర ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు పతనమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బస్తా నిమ్మ(800 నుంచి 900 నిమ్మకాయలు) కేవలం రూ.300 మాత్రమే పలుకుతోంది. నిమ్మ ధర ఈ స్థాయిలో పడిపోవడం మూడేళ్ల కాలం ఇదే ప్రథమం. రెండు నెలల కిందట ఒక్కో నిమ్మ ధర రూ.4 పలుకగా నేడు పావలా పలుకుతోంది.

జిల్లాలో 3,200 ఎకరాల్లో నిమ్మ సాగు

నంద్యాల జిల్లాలో 3,200 ఎకరాల్లో నిమ్మ సాగు చేశారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో 1,700 ఎకరాల్లో నిమ్మ సాగు అవుతోంది. జిల్లాలో నిమ్మ ధరలు రెండు నెలల క్రితం ఎగిసిపడి ఒక్కసారిగా పడిపోయాయి. ప్రస్తుతం నిమ్మకాయల బస్తా రూ.300 పలుకుతోంది. తక్కువ ధర ఉండటంతో కాయలు కోయాలో లేదో తెలియక రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా సాగవుతున్న నిమ్మకాయలు ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీ, పూనే, చెన్నై, ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. స్థానికంగా ధర లేకపోతే ఇక్కడి రైతులు బెంగళూరు, చెన్నై పంపిస్తుంటారు. ప్రస్తుతం అక్కడ కూడా ధర అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం చెట్టుకున్న నిమ్మకాయలు కోసిన కోత కూలి కూడా రావడం లేదు. నిమ్మ సాగు ఖర్చుతో కూడుకున్నది. ఒక్కసారి ఎరువులు చల్లాలంటే ఎకరాకు రూ.6 వేలు వరకు ఖర్చు అవుతుంది.

చెట్లు ఎండిపోయి..

నిమ్మచెట్లకు తెగుళ్లు సోకడంతో చెట్లు ఎండిపోయి దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. మూడేళ్ల పాటు కాపాడుకుంటూ వస్తున్న నిమ్మచెట్లు దిగుబడి వచ్చేలోపే తెగుళ్లు అధికమై చెట్లు ఎండిపోయాయి. కొందరు రైతులు ఐదేళ్ల పాటు నిమ్మ సాగుచేసి శ్రమించిన దిగుబడి, ధర, కూలీలకు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో కొందరు రైతులు నిమ్మ చెట్లను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి.



నిమ్మచెట్లను తొలగిస్తున్న కూలీలు



తెగుళ్లతో దెబ్బతిన్న చెట్లను చూపిస్తున్న రైతు పుల్లయ్య

సాగు విస్తీర్ణం తగ్గుతూ..

గతంలో ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో రెండు వేల ఎకరాల్లో నిమ్మ సాగు అవుతుండేది. ధర పతనం కావడం, గత ప్రభుత్వంలో పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలకు ప్రోత్సాహం లభించడంతో రైతులు మళ్లీ నిమ్మసాగు వైపు మొగ్గు చూపారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో ఎకరాకు 110 నిమ్మచెట్లు, ఏడాదికి రూ.48 వేలు చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తోంది. రైతు మరో రూ.50 వేలు వరకు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిమ్మ సాగులో రైతులు మూడేళ్ల పాటు అంతర్‌పంట సాగు చేసి పంటలు పండించుకునేలా ఉద్యానశాఖ ప్రోత్సహిస్తోంది. ఐదేళ్ల తరువాత మాత్రమే దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కల్పించడంతో పండ్ల తోటల సాగుపై దృష్టి సారించారు.

రెండెకరాల్లో నిమ్మ సాగుచేశా



రెండెకరాల్లో నిమ్మ సాగుచేశా. ఏప్రిల్‌లో మంచి ధర వచ్చింది. లాభాలు వస్తాయని అనుకునేలోపే ధర ఒక్కసారిగా పడిపోయింది. బెంగళూరు, చెన్నైకు పంపించాలనుకున్నా అక్కడ కూడా ఆశించిన మేర ధర లేదు.

- చిన్న మస్తాన్‌వలి, రైతు, ముత్యాలపాడు

ధర లేక చెట్లను తొలగించా



4.30 ఎకరాల్లో నిమ్మతోట సాగుచేశా. పదేళ్ల పాటు నిమ్మతోటను కాపాడుకుంటూ వచ్చా. చెట్లకు వైరస్ సోకి దెబ్బతిన్నాయి. మిగిలిన కొన్ని చెట్లకు కూడా కాయలున్నా ధరలేదు. వైరస్, ధర లేకపోవడంతోనే నిమ్మ తోటను తొలగించేశా.

- ఈదుల లక్ష్మీదేవి, రైతు, మల్లెవేముల

దిగుబడి సమయంలో ధరలేక..



నాలుగెకరాల్లో నిమ్మతోటను కౌలుకు తీసుకున్నా దిగుబడి వచ్చే సమయంలో ధర లేక నష్టపోయా. తెగుళ్లతో చెట్లు దెబ్బతిని కాయలు రాక పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. కౌలు చెల్లించేందుకు కూడా దిగుబడి రాక నష్టపోవాల్సి వచ్చింది.

- మల్లి, కౌలు రైతు, మల్లెవేముల

పోలవరం-బనకచర్ల

సాగునీటి ప్రాజెక్టు మరో కాళేశ్వరం

- రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు
- సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించిన 'ఆలోచనా పరుల వేదిక'



ముచ్చుమర్రి ఎత్తిపోతల వద్ద అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆలోచనా పరుల వేదిక నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను కృష్ణాజలాలతో అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన తలకెత్తుకున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరం అవుతుందని రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ పోలవరం బనకచర్ల ప్రాజెక్టు వివరాలను పరిశీలించాక అది ఒక పనికి మాలిన ప్రాజెక్టు అని నిర్ధారణకు వచ్చామన్నారు. మంగళవారం జిల్లాలో 'సీమ సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన చేసిన ఆలోచనాపరుల వేదిక కమిటీ సభ్యులు పర్యటించారు. పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల పథకం, జూపాడుబంగ్లాలోని పోతులపాడు ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీప్రసాద్, జొన్నగడ్డ రామారావు, నల్లబోతు చక్రవర్తి, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, రైతు సంఘం నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు రాయలసీమకు ఏమాత్రం ఉపయోగపడకపోగా వేల కోట్ల రూపాయలు అదనంగా ఏపీకి గుదిబండగా మారుతుందన్నారు. సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజక్టుల వివరాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఏ ప్రాజెక్టు వద్ద ఏ మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని నిధులు కేటాయిస్తే ఆ ప్రాజెక్టులు పూర్తవుతాయన్న అంశాలను ఈ పర్యటనలో తెలుసుకుంటామన్నారు. ఈపెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలన్న కుతూహలం ఏ మేరకు ఈ ప్రభుత్వానికి ఉందన్న విషయాలను గుర్తిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పరిశీలించి అక్కడ రైతులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తెలంగాణలో అంతర్గతంగా ఉన్న రాజకీయ వైరాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఒక వాదనను ఎత్తుకుంటే దానికి కాంగ్రెస్ పార్టీ వంతపాడుతూ అవే అబద్ధాలను ఆడుతోందన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం విషం చిమ్ముతోందని ఆరోపించారు. మల్యాల ఎత్తిపోతల ద్వారా జలచౌర్యానికి పాల్పడుతున్న దొంగలు అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తే ఏపీ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ఏపీ ప్రభుత్వం దొంగల్లా హంద్రీనీవా ద్వారా నీటిని దోచుకెళ్తోందని తెలంగాణ సీఎం రేవంత్, ప్రతిపక్ష నాయకులు, ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా ఆరోపిస్తుంటే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కాని, ఇరిగేషన్ అధికారులు కాని ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. అక్కినేని భవాణి ప్రసాద్ మాట్లాడుతూ 30 ఏళ్లకాలంలో గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులపై కోట్ల రూపాయలను ఖర్చుచేసినా కూడా అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 14నెలల్లో వేల కోట్ల రూపాయలు అప్పులు చేసిందన్నారు. రాయలసీమ సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ బచావత్ ట్రిబునల్, రాష్ట్ర విభజన చట్టం ద్వారా రాయలసీమకు సాగునీటి కోసం హక్కుగా ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ముచ్చుమర్రి ఎత్తిపోతల, మల్యాల ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. అయితే ఆ మేరకు సీమకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. లక్ష క్యూసెక్కుల నీటిని సీమ ప్రజలు దోచుకుంటున్నారని తెలంగాణ ప్రభుత్వం అబండాలు వేయడం సమంజసం కాదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు మాట్లాడుతూ 'సీమ'కు కృష్ణాజలాలను తరలించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, లెనిన్‌బాబు, రఘురాం పాల్గొన్నారు.

సర్వే మాయాజాలం

- చనిపోయిన వారి పేర్ల మీద వందల ఎకరాలు
- సంక్షేమ పథకాలకు దూరమైన ఓ కుటుంబం
- మూడేళ్ల నుంచి తిరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం



నేటికి కూడా ఆన్‌లైన్‌లో చూపిస్తున్న భూమిని చూపిస్తున్న చిన్నపుల్లమ్మ

జూపాడుబంగ్లా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేలో అధికారుల నిర్లక్ష్యం అంతా ఇంతాకాదు. ఏకంగా మృతిచెందిన వారిపేర్లమీద వందల ఎకరాలు ఆన్‌లైన్లో ఎక్కించి , అర్హులైనా వారికి ఎక్కించకుండా వారి సర్వే మాయాజాలంగా మారింది. దీంతో ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం లేదు. మూడేళ్ల నుంచి జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబం తమ గోడు వెల్లబోసుకుంది. మండలంలోని తూడిచర్ల గ్రామానికి చెందిన బి.శ్రీనివాసులు అనే రైతుకు సర్వేనంబర్ 151-1లో 4.55 ఎకరాల పొలం ఉంది. అతడు 2022లో మృతిచెందారు. పొలాన్ని శ్రీనివాసులు పేరు మీద ఉండగా దాన్ని భార్య చిన్నపుల్లమ్మ పేరుమీద మార్చాలని, పింఛన్ మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగారు. మీఆయన పేరుమీద 135 ఎకరాల పొలం ఆన్‌లైన్‌లో చూపిస్తుందని పింఛను రాదని అధికారులు తిరస్కరించారు. శ్రీనివాసులు పేరుమీద ఉన్న 4.55 ఎకరాలు ఆమెపేరుమీద రెండేళ్లకు మార్చారు. 10 సర్వే నంబర్లకు సంబంధించిన ఆ 135 ఎకరాలు మాత్రం ఈరోజుకు కూడా శ్రీనివాసులు పేరుమీద ఆన్‌లైన్‌లో అలాగే ఉంది. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా స్పందనలేదు. మృతుడి భార్యకు వితంతు పింఛన్ రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం అందించే 'అన్నదాత సుఖీభవ' కూడా అందలేదు. శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వెంకటేశ్వర్లుకు మూడెకరాల పొలం ఉంది. ఈయన కుమారుడు జయశంకర్ 10వ తరగతి చదువుతున్నాడు. జయశంకర్ ఆధార్‌నంబరు 135 ఎకరాలకు అనుసంధానించడంతో 'తల్లికి వందనం' రాకపోవడంతో పాటు, తండ్రి వెంకటేశ్వర్లకు అన్నదాత సుఖీభవ కూడా పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యేను కూడా ఈకుటుంబం కలిశారు. ఆన్‌లైన్‌లో ఉన్న 135 ఎకరాలను తొలగించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని , లేకపోతే ఆన్‌లైన్‌లో ఉన్న భూములైనా చూపించాలని రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మూడేళ్ల నుంచి అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేయని తప్పుకు ప్రభుత్వం అందించే పథకాలన్నీ తమతో పాటు తమ కుటుంబమంతా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

కమీషన్ల కింద ఏటా.. రూ.2కోట్లు హాంఫట్



పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

- దోపిడీకి గురవుతున్న టమోటా రైతులు
- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు
- 10శాతం సుంకం వసూలు చేస్తున్న వ్యాపారులు

పత్తికొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ కింద రైతులు 83 హెక్టార్లలో పంటలు సాగుచేస్తారు. ప్రధాన వాణిజ్యపంటలుగా వేరుశనగ, పత్తి, ఆముదం పంటలతో పాటు ఉల్లి, కంది పంటలు అధికంగా సాగు చేస్తారు. దీనితో పాటు ప్రత్యామ్నాయ పంటగా ప్రతి రైతు టమోటాను సాగుచేస్తారు. సుమార్ రెండు వేల హెక్టార్లలో ఇక్కడి రైతులు టమోటాను సాగుచేస్తుంటారు. పండిన టమోటాను పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. వ్యాపారులు రైతుల నుంచి అనధికారికంగా 10శాతం సుంకం వసూలు చేస్తున్నారు. దీంతో రూ.1.5కోట్ల నుంచి రూ.2కోట్లు మాయం చేస్తున్నారు. మార్కెట్‌యార్డులో వ్యాపారుల కమీషన్ దోపిడీకి అడ్డుకట్టవేసి వారి ఆగడాల నుంచి రైతులను కాపాడాల్సిన అవసరం ఉంది.

ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం..

ఐదేళ్లక్రితం కేంద్ర ప్రభుత్వం కూరగాయలు, టమోటా వంటి పచ్చి సరుకుపై సుంకం పూర్తి స్థాయిలో ఎత్తివేసి ఆపంట కొనుగోలుపై సుంకం వసూలు చేయరాదని జీవోలు జారీచేసింది. పత్తికొండ యార్డులో జీరో సుంకం విధించిన ఈఐదేళ్ల కాలంలో 10శాతం సుంకాన్ని పంట కొనుగోలులో రైతుల నుంచి అనధికారికంగా వసూలుచేస్తున్నారు. వ్యాపారులం దరూ సిండికేట్‌గా ఈమార్కెట్లో కొనుగోళ్లు, కమీషన్ వసూళ్లు చేస్తుండడంతో మార్కెట్‌శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తే కొనుగోళ్లకు దూరంగా ఉంటామని బెదిరింపులకు దిగుతుంటారు.

ఎకరాకు 4క్వింటాళ్ల దిగుబడి..

ఎకరా టమోటా సాగుకు నారు, ఎరువులు, పిచికారి మందులు అన్ని కలుపుకుని రూ.30వేల దాకా వస్తుంది. మంచి దిగుబడులు వస్తే కోతకు 4క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సకాలంలో పంటకు నీరు అందితే 30కోతల వరకు రైతులకు పంట కాలం వస్తుంది. కోత కోసిన పంటను మార్కెట్‌కు తరలించేందుకు 10కిలోల గంపకు రూ10, 25కిలోల గంపకు రూ.20 చొప్పున చెల్లించాలి. పంట పెట్టుబడులు, కోతకూలీలు, ఆటోబాడుగలు కలుపుకుంటే కిలో కనీసం రూ.8కు పంట అమ్ముడుపోతే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారులు తమకు నచ్చిన ధరతో పంటను కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తుంటారు.

వేరే వ్యాపారులు వస్తే బెదిరింపులే..

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటుకు పూర్వం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టమోటా విక్రయాలు జరిగేవి. పత్తికొండ వ్యాపారులతో పాటు హైదరాబాద్, వరంగల్, చెన్నై వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోళ్లలో పాల్గొనేవారు. మార్కెట్ యార్డు ఏర్పాడ్డాక కూడా వేరేప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ పంట కొనుగోలులో పాల్గొనేవారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి వేరే ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. వ్యాపారులు 10శాతం సుంకం అక్రమంగా వసూలు చేసినా ఏమీచేయలేని పరిస్థితి.

ఒక్కశాతం సెస్ ఎగవేత

టమోటా కొనుగోళ్లకు సంబంధించి జరిగిన వ్యాపారంపై ఒక్కశాతం మార్కెట్‌యార్డుకు సెస్ చెల్లించాలి. వ్యాపార లావాదేవీలు జరుపుకునేందుకు ఈసెస్‌ను వ్యాపారులు చెల్లించాలి.

మిగతా 6వ పేజీలో

కళానిలయం



నటన, నాట్యం, సంగీతం, సాహిత్యం వంటి అంశాలను నలుదిక్కులా చాటిచెబుతూ కందనవోలు కళామతల్లికి మణిహారంగా విరాజిల్లుతోంది కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం. ఒకటి కాదు, 55 ఏళ్ల ప్రస్థానంలో రెండు కాదు, ఏకంగా 38 రాష్ట్ర నంది అవార్డులు సాధించి, రాష్ట్రంలోనే ఏకైక కళాసంస్థగా విరాజిల్లుతోంది. కళలకు, సాహిత్యానికి కొలమానం డబ్బు, భాష, ప్రాంతాభిమానాలు ఏమీ లేవనే రీతిలో ఉచితంగా కళాకారులకు, సాహిత్యాభిలాషులకు అవకాశం కల్పిస్తోంది. పేద కళాకారులకు, దూరప్రాంతాల నుంచీ వచ్చే కళాకారులకు తగురీతిలో ఆర్థిక సహకారాలు కూడా అందిస్తూ కళలను ప్రోత్సహిస్తూ కళల కాణాచిగా నిలుస్తోంది. వేలాది మంది ఔత్సాహిక కళాకారులకు నిలయంగా నిలుస్తోన్న టీజీవీ కళాక్షేత్రం 55 ఏళ్లుగా తన ఉనికిని చాటుకుంటోంది. నాడు ఆరుబయలు కళాక్షేత్రంగా ఉన్న లలిత కళాసమితి తన రూపురేఖలను మార్చుకొని అత్యంత ఆధునిక హంగులతో ఏసీ థియేటర్లను మరపిస్తోంది.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

టీజీ వెంకటేశ్ సహకారంతో...



కర్నూలులో 1970లో అప్పటి ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కేవీ చలపతిరావు, డిప్యూటీ కలెక్టర్ కె. వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ 'లలిత కళాసమితి' పేరుతో సంస్థను నెలకొల్పారు. సి.క్యాంపులోని 24 సెంట్ల స్థలాన్ని సేకరించారు. వీరి కృషి ఫలితంగా 1998లో మొట్టమొదట జరిగిన నంది నాటక పోటీల్లో ఐదు నందులతో పాటూ జ్యూరీ అవార్డును 'నరనారాయణ' అనే నాటకం అందుకుంది. దీనికి సింహం లక్ష్మీనారాయణ దర్శకుడు. వ్యవస్థాపకుల్లో ఒకరైన సయ్యద్ అహ్మద్ సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహిస్తూ ఎన్నో బహుమతులు సాధించారు. ఆరోజుల్లో జంపాల శివయ్య అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక సమితి రూపురేఖలు మార్చేశారు. తర్వాత ఈ పరంపరను అధ్యక్షులుగా థామస్‌రెడ్డి, పి.దస్తగిరి కొనసాగించారు. వారి తర్వాత అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన పత్తి ఓబులయ్య కళాక్షేత్రం అభివృద్ధిలో తనదైన ముద్రను వేసుకున్నారు. ఇదే క్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సహకారంతో 2006నుంచి సమితి రూపురేఖలు మారిపోయాయి. 2009లో ఆడిటోరియం లాంఛనంగా ప్రారంభమైంది. తర్వాత ఏసీ ఏర్పాటుతోపాటు ప్రేక్షకులు హాయిగా కూర్చొని తలకించే కుషన్ సీట్లు, లిఫ్ట్ ఏర్పాటు, అగ్నిమాపక సౌకర్యం కల్పించారు. టీజీవీ కళాక్షేత్రం ప్రాంగణంలో రెండంతస్తుల భవన నిర్మాణానికి టీజీ వెంకటేశ్ తిరిగి రూ.3 కోట్ల విరాళం అందజేశారు. ఫలితంగా నవ్యాంధ్ర రాష్ట్రంలోనే అన్ని హంగులు ఉన్న కళామందిరంగా రూపొందింది. 38 నందులతో పాటు తిరుపతి, ఒంగోలులో జరిగే జాతీయ నాటక పోటీల్లోనూ ఎన్నో అవార్డులను కళా క్షేత్రం కైవసం చేసుకుంది.


టీజీవీ కళాక్షేత్రానికి లభించిన అవార్డులు

నెలరోజులూ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు

టీజీవీ కళాక్షేత్రంలో నెలపొడవునా సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి 'ఆది వారం సాంస్కృతిక కార్యక్రమం', ప్రతి నెలా చివరి ఆదివారం 'నాటకం', అలాగే సాంఘిక నాటిక, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే బాలల కోసం ప్రత్యేకంగా 'టీజీవీ అకాడమీ' పేరుతో చిన్నారులకు నృత్య శిక్షణలు వారంలో రెండు రోజులు ఏర్పాటు చేశారు. అలాగే వేసవిలో బాలల కోసం ప్రత్యేకంగా నృత్య, నటన, చిత్రలేఖన, వక్తృత్వ శిక్షణలు ఇస్తూ వారిని కళారంగం పట్ల ప్రోత్సాహం కల్పిస్తున్నారు.

- కళలకు నిలయం.. సాహిత్యానికి నీరాజనం..!
- 38 నంది పురస్కారాలు సొంతం
- కళామతల్లి మణిహారంగా టీజీవీ కళాక్షేత్రం

నంది అవార్డులు సాధించిన నాటకాలు ఇవే

199	నరనారాయణకు	5
1999	పులిస్వారీ	2
1999	మబ్బుల్లో బొమ్మ	1
2000	కృష్ణాభిమన్యు	1
2004	భక్తమాధవదాసు	1
2007	శ్రీకృష్ణాభిమన్యు	2
2009	మహారథి కర్ణ	1
2011	ఓ మనిషీ నీకు జోహార్లు	2
2012	బభ్రువాహన విజయం	1
2012	బభ్రువాహన విజయం (వెండి నందులు)	3
2014	శ్రీకృష్ణాభిమన్యు	3
2015	కర్ణార్జునీయం	4
2016	ప్రమీలార్జున పరిణయం	7
2017	సైసై నరసింహారెడ్డి	3
2023	శ్రీకృష్ణకమలపాలిక	2


ఆడిటోరియంలో ప్రేక్షకులు

కళలు, సాహిత్యాలకు నిత్యం ప్రోత్సాహకాలు



కళలు, సాహిత్యానికి పెద్దపీట వేస్తూ నిత్యం ప్రోత్సాహకాలు అందిస్తూ టీజీవీ కళాక్షేత్రం ముందుకు పోతోంది. గత 55 ఏళ్లుగా నిర్విరామంగా సేవలు అందిస్తోంది. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ల సహకారం ఎన్నటికీ మరువలేనిది. టీజీ వెంకటేశ్ ఆర్థికంగానే కాకుండా, హార్థికంగా ఇచ్చిన చేయూత నేడు నగరంలో టీజీవీ కళాక్షేత్రం ఒక స్థానం సంపాదించుకుంది. కళామతల్లికి సేవ చేయాలనే ఆయన ప్రోత్సాహమే మమ్మల్ని నడిపిస్తోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రదర్శించే పద్య నాటకాలకు నేను దర్శకత్వం వహిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తున్నాం. అలాగే అనేక పురస్కారాలు సాధిస్తున్నాం. మేమే కాకుండా ఎవరు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించినా, కళాక్షేత్రం అన్ని సౌకర్యాలతో పాటూ ఉచిత విద్యుత్తును కూడా కల్పిస్తూ వారికి అవకాశం ఇస్తోంది. స్థానిక కళాకారులకు ప్రోత్సాహంతో పాటూ, ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులకు కూడా చేయూత ఇచ్చే విధంగా కార్యక్రమాలు నెలపొడవునా నిర్వహిస్తున్నాం.

- కళారత్న పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు, టీజీవీ కళాక్షేత్రం

కమీషన్ల కింద ఏటా.. రూ.2కోట్లు హాంఫట్



5వ పేజీ తరువాయి

బయటి వ్యాపారులు రాకుండా తాము మాత్రమే టమోటా కొనుగోలు చేస్తున్న స్థానిక వ్యాపారులు అక్రమంగా వసూలుచేసే 10శాతం సుంకం ఆపకపోగా మార్కెట్‌యార్డుకు చెల్లించాల్సిన 1శాతం సెస్‌ను కట్టకుండా ఎగవేస్తున్నట్లు తెలిసింది. అధికారులను సైతం వారు బెదిరిస్తూ మాఫియాను తలపిస్తున్నట్లు సమాచారం.

ప్రతి ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల..


మార్కెట్‌యార్డులో ఏటా రూ.15 నుంచి రూ.20కోట్ల మేర టమోటా వ్యాపారం జరుగుతున్నట్లు అధికారిక నివేదికల ద్వారా తెలుస్తుంది. అనధికారికంగా ఈమొత్తం ఇంకా ఎక్కువ ఉండవచ్చని సమాచారం. గత ఏడాది ఆగస్టు నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఏడు నెలల పాటు ఈమార్కెట్‌లో టమోటా విక్రయాలు జరగగా 72,642 టన్నుల టమోటాను వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. 6నుంచి 8టన్నుల వరకు లారీల ద్వారా వ్యాపారులు కొన్నపంటను తరలిస్తుంటారు. గత ఏడాది 10 నుంచి 12వేల లారీల సరుకును వ్యాపారులు ఇక్కడి నుంచి ఎగుమతులు చేశారు. ఏడునెలల పాటు జరిగిన 72,642 టన్నులకు గాను రూ.15 నుంచి 20కోట్ల వరకు వ్యాపారులు లావాదేవీలు జరిపారు.

పేరుకే పెద్దమార్కెట్

పత్తికొండ టమోటా మార్కెట్ పేరుకే పెద్ద మార్కెట్. టమోటా మార్కెట్ ద్వారా మార్కెట్‌యార్డుకు అందుతున్న ఆదాయం మాత్రం నామమాత్రమే. గత ఏడాది రూ.8లక్షలు మాత్రమే వ్యాపారుల నుంచి సెస్ డబ్బులు అందాయి. వారం సంతద్వారా వారానికి రూ.60 నుంచి రూ.70వేల ఆదాయం ఉండటంతో సిబ్బంది జీతభత్యాలు ఇవ్వగలుగుతున్నాం.

● కార్నలీస్, కార్యదర్శి, పత్తికొండ మార్కెట్‌యార్డు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమోటా కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలి. గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులపై 10శాతం కమీషన్ దోచుకోవడం దారుణం. టమోటా కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేసి వ్యాపారులపై చర్యలుచేపట్టాలి.

● డి.రాజాసాహెబ్, ఏపీ రైతుసంఘం జిల్లాకార్యవర్గ సభ్యుడు


చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మఠం అధికారులు

ఉత్సవాలకు ఆహ్వానం

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మఠం అధికారులు మంగళవారం ఆహ్వానం పలికారు. వారితో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి అనిత, మాజీమంత్రి, ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, సజ్జల రామకృష్ణా రెడ్డిలకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ ఆహ్వాన పత్రికలను అందజేశారు.


లోకేశ్‌కు ఆహ్వానం


జగన్‌కు ఆహ్వానం

వాన కోసం..

● తుంగా జలంతో గ్రామ దేవతలకు అభిషేకాలు ● రచ్చుమర్రిలో అనాదిగా వస్తున్న ఆచారం

మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరుణదేవుడు కరుణించకపోవడంతో పంటలు ఎండిపోవడం చూస్తున్న రైతన్నలు అనాదిగా వస్తున్న సంప్రదాయ, ఆచారాలను కొనసాగిస్తున్నారు. మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వెయ్యి మంది రైతులు పాదయాత్రగా మాధవరం గ్రామానికి వెళ్లారు. అక్కడ తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తమ వెంట తుంగా జలాలను తీసుకొచ్చారు. బిందెలు, చెంబులు, పాత్రల ద్వారా తుంగా జలాలను స్వగ్రామానికి తీసుకొచ్చారు. భజనమండలి, తప్పెట్లు, బీరప్పడోల్లుతో పాదయాత్రతో గ్రామానికి చేరుకుని తెచ్చిన తుంగభద్ర జలాలతో గ్రామంలో కొలువైన బంగారమ్మ దేవతకు, ఆంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి, మారెమ్మ, దేవమ్మ దేవతలకు అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు.


తుంగా జలాలతో ఊరేగింపుగా వెళ్తున్న రచ్చుమర్రి గ్రామ ప్రజలు

సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యం

- సినీ చరిత్రలో 50 ఏళ్లు పూర్తి
- 500 సినిమాల్లో నటించా..
- విలక్షణ నటుడు సాయికుమార్



మంత్రాలయం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల సినీ చిత్ర పరిశ్రమలో సందేశాత్మక చిత్రాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చాననీ ప్రముఖ తెలుగు, తమిళం, కన్నడ సినీ నటుడు సాయి కుమార్ అన్నారు. మంగళవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 1975 జనవరి 11న తన 14 ఏళ్ల వయస్సులో బాలనటుడిగా 'దేవుడు చేసిన సినిమా' లో తెరంగేట్రం చేశానని అన్నారు. తెలుగులో 500 చిత్రాలు, కన్నడ, తమిళంతో కలిపి వందకు పైగా చిత్రాల్లో తాను నటించినట్లు తెలిపారు. వెయ్యికి పైగా డబ్బింగ్ చెప్పానన్నారు. 20కి పైగా నంది, ఫిల్మ్‌ఫెయిర్ పాటు పలు అవార్డులు అందుకున్నానని తెలిపారు. తన కొడుకు ఆది సాయికుమార్ ప్రస్తుతం మూడు చిత్రాల్లో హీరోగా చేశాడనీ, త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. తన తండ్రి పీజే శర్మ వారసత్వాన్ని అందిపుచ్చుకుని తమ్ముళ్లు రవిశంకర్, అయ్యప్ప నటులుగా, కళాకారులుగా కొనసాగుతున్నారన్నారు. పోలీస్ స్టోరీ చిత్రంతో తన జీవితం ఒక మలుపు తిరిగిందని, పోలీస్ స్టోరీతో పోలీసులకు ఒక ఆదర్శమైన చిత్రాన్ని రూపొందించామన్నారు. తాను ఎక్కడకు వెళ్లినా పోలీసులు కనిపిస్తే.. తన పాత్రనే ఆదర్శంగా తీసుకుంటామని పోలీసులు చెబుతున్నప్పుడు తనకు ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. సాయిదుర్గతేజ హీరోగా సంబరాల ఏటిగట్టు, 12ఏ రైల్వే కాలనీ, ర్యాంప్, బ్యాడ్ బాయ్ కార్తిక్, సత్య సన్నాఫ్ హరిశ్చంద్ర, రాజా ది రాజా, డేగల్ వంటి చిత్రాల్లో నటించడం జరిగిందన్నారు. మొదటి చిత్రం 100 రోజులు రికార్డు కొడితే.. 50 ఏళ్ల తర్వాత సంక్రాంతికి వస్తా.. అనే చిత్రం విజయవంతం గా సంతృప్తినిచ్చిందని అన్నారు. కన్నడ, తమిళ్‌లో రెండేసి చిత్రాల్లో నటిస్తున్నానని చెప్పారు. తన కుమార్తె డాక్టర్ జ్యోతిర్మయి డాక్టరుగా పని చేస్తూ భరతనాట్యంలో రాణిస్తోందన్నారు. తన చెల్లెలు సైతం చెన్నై, హైదరాబాదులో ఈ సంప్రదాయ నృత్య కళాకారిణి అకాడమీలు నిర్వహిస్తున్నారన్నారు. చిన్నతనంలో మంత్రాలయం వచ్చానని, రెండోసారి మంత్రాలయం రావడం జరిగిందన్నారు. రాఘవేంద్రస్వామి, పీఠాధిపతి ఆశీస్సులతో కుటుంబంతో మళ్లీ మంత్రాలయానికి వస్తానని తెలిపారు.

అప్పులు తెచ్చి భోజనం వడ్డిస్తున్నారు



- భారంగా మారిన మధ్యాహ్న భోజనం నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న వంట నిర్వాహకులు
- జిల్లాలో 23 ప్రభుత్వ కళాశాలల్లో పథకం అమలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం బిల్లులు అందక వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల నుంచి బిల్లులు అందక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు పెట్టలేక చుక్కలు చూస్తున్నారు. వంట కార్మికుల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికిచ్చేది అరకోరే.. అదికూడా సకాలంలో రాక వర్కర్లు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 4వ తేదీ నుంచి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఇంటి నుంచి లంచ్ బాక్స్‌లు తెచ్చుకునే వెసలుబాటు లేక కడుపులు మాడ్చుకుని సాయంత్రం వరకు ఉండి వెళ్లేవారు. అయితే ఈ ఏడాది నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. మెనూలో సమూల మార్పులు చేసి రుచి, శుచికరమైన ఆహారం అందిస్తుండటంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య ఘననీయంగా పెరిగింది. హాజరు శాతం కూడా పెరిగింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 9,772 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,522 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,250 మంది ఉన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట ఏజెన్సీలకు ప్రభుత్వం సివిల్ సప్లయిస్ ద్వారా బియ్యం, గుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రోజుకు ఒక విద్యార్థికి నూనె, దినుసులు, కూరగాయల ఖర్చులకు గానూ ఒక్కో విద్యార్థికి రూ.8.57 చొప్పున వంట ఏజెన్సీల నిర్వాహకులకు చెల్లిస్తారు. రోజుకు 90 శాతం మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. వంట కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.3వేలు గౌరవ వేతనం చెల్లిస్తారు. మెస్ బిల్లులతో పాటు వర్కర్స్‌కు వేతనాలు కూడా మంజూరు చేస్తారు. ఒక కళాశాలలో నెలకు రూ.8 లక్షల వరకు బిల్లులు అవుతున్నాయి. ఈ లెక్క ప్రకారం ఆరు నెలలకు గానూ రూ.50 నుంచి రూ.60 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధిక రేట్లకు వడ్డీలతో అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారు. అసలు, వడ్డీ కలిపి తడిసి మోపెడవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భోజనాలు పెట్టలేమని వంట ఏజెన్సీల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి గత ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలి. బిల్లులు ఇవ్వకపోతే భోజనాలు ఎలా పెట్టాలి? తెచ్చిన అప్పులకు వడ్డీలు, అసలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

- రమాదేవి, వంట కార్మికురాలు, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కర్నూలు

కుకింగ్ కాస్ట్ పెంచాలి



మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని పెంచి ఇవ్వాలి. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతుండటం వల్ల తినే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సకాలంలో బిల్లులు మంజూరు చేయడం లేదు. గ్యాస్ ధరలతో పాటు కూరగాయలు, నూనెలు, వంట దినుసుల రేట్లు కూడా పెరిగాయి. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు కూడా చెల్లించాలి.

- పర్వీన్, వంట కార్మికురాలు, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కర్నూలు

బిల్లుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని మధ్యాహ్న భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించేందుకు ఆయా కళాశాలల నుంచి వివరాలు సేకరించి ఇంటర్మీడియట్ బోర్డుకు పాఠశాల ఎడ్యుకేషన్ శాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. త్వరలోనే వంట ఏజెన్సీల నిర్వాహకుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతాయి. కంగారు పడవద్దు. వంట నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించాలి. పరిశుభ్రత పాటించాలి.

- సురేష్‌బాబు, డీఐఈవో






- కర్నూలు రూరల్(ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

జల హొయలు

కర్నూలు నగర శివారులోని గార్గేయపురం చెరువు జలకళను సంతరించుకుంది. చెరువుకు అనుబంధంగా ఉన్న చెక్ డ్యాంల నుంచి వరద పొంగి ప్రవహిస్తోంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గార్గేయపురం చెరువు నిండు కుండలా దర్శనమిస్తోంది. మరో వైపు హంద్రీనీవా కాలువ తూము ద్వారా జలాలు విడుదల కావడంతో చెరువుకు జలకళ సంతరించుకుంది. నందికొట్కూరు రోడ్ నగరవనం సమీపంలోని గార్గేయపురం చెరువు వద్ద చెక్‌డ్యాంలపై వస్తున్న జల హొయలను చూసేందుకు నగర ప్రజలు భారీగా తరలివస్తున్నారు.

ఎంపీఈవోలకు గుర్తింపు ఏదీ?

- సచివాలయాల సిబ్బందితో సమానంగా విధులు
- జీతాలు మాత్రం అంతంతే
- ఉద్యోగ భద్రత కరువాయె
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- సమ్మె వైపు అడుగులు?



పాణ్యం వ్యవసాయశాఖ కార్యాలయం

వ్యవసాయ శాఖలోని పథకాలు రైతులకు చేరవేయడంలో కీలక పాత్ర వహిస్తున్న బహుళ ప్రయోజన విస్తరణాధికారులు(ఎంపీఈవో). 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వీరిని నియమించింది. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో పని చేస్తున్న వీరికి గుర్తింపు ఇవ్వకుండా సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చి వీరిని నిర్లక్ష్యం చేసింది. సచివాలయాల సిబ్బందితో అర్హత గల ఎంపీఈవోలు సచివాలయాల సిబ్బందితో పాటు సమానంగా విద్యార్హతలు ఉండి, సమానంగా పని చేస్తున్నా వేతనంలో మాత్రం చాలా తేడా ఉంది. ఎలాగో అలా అరకొర వేతనాలతో బతుకుబండి సాగిస్తుండగా ఐదు నెలలుగా వేతనాలు కూడా అందడం లేదు. దీంతో ఏమిచేయాలో తోచక సమ్మెబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

పాణ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీఈవోలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నా వారికి గుర్తింపు మాత్రం అంతంత మాత్రమే ఉంది. వ్యవసాయ శాఖను మరింత అభివృద్ధి బాట పట్టించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2014 డిసెంబరు 18న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖలో 306 ఎంపీఈవో పోస్టులను నిర్ణీత గౌరవ వేతనం నెలకు రూ.8వేల చొప్పున నియమించింది. కాంట్రాక్టు పద్ధతిపై రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన జీవోఆర్‌టీ నెంబరు 693 ఎఅండ్‌సీ (వ్యవసాయ శాఖ2)అనుసరించి మొదటి విడత నియామకాలు జరిపింది. వీరిలో 109 మంది మహిళలున్నారు. ఎంపికలో స్థానిక లకు 80 శాతం, 20 శాతం స్థానికేతరులకు 80శాతం మార్కులతో మౌఖికపరీక్ష ఆధారంగా 20 శాతం మార్కులు పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు.

సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి..

గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో పని చేస్తున్న వీరికి ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు. సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చి నిర్లక్ష్యం చేసిందని ఎంపీఈవోలు ఆరోపిస్తున్నారు. సచివాలయాల సిబ్బందితో అర్హత గల ఎంపీఈవోలు సచివాలయాల సిబ్బందితో పాటు సమానంగా విద్యార్హతలు ఉండి, సమానంగా పనిచేస్తున్నా వేతనంలో మాత్రం సమాన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో అభ్యర్థులను ఎంపిక చేశారు. 2014 నుంచి రూ. 8వేల వేతనంతో వీరు పనిచేస్తుండగా 2019లో టీడీపీ ప్రభుత్వం వేతనాన్ని రూ.12 వేలకు పెంచింది. అప్పటి నుంచి వీరి వేతనాలు గానీ, ఎలాంటి ఇతర సౌకర్యాలు పెంచలేదు. వీరికి ఏలాంటి గుర్తింపు దక్కలేదని ఆరోపిస్తున్నారు. పనికి సమానమైన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కరువై తక్కువ వేతనంతో బతుకీడుస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుత ఖర్చులకు ఈవేతనం ఏమాత్రం సరిపోదని పనిభారం పెరిగిందని సరైన న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చాలీచాలని వేతనాలతో..

మార్చి నెల నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు ఎంపీఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న వీరి జీవనంపై వేతనాలు అందకపోవడం సమస్య మరింత భారంగా మారినట్లు పేర్కొంటున్నారు. ఐదు నెలలుగా వేతనాలు అందకుండా ఎలా పని చేయాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయక పోవడంతో ఎంపీఈవోలు సమ్మె బాట పట్టనున్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీఈవోల సంఘాలు పెన్‌డౌన్ సమ్మెపై చర్చలు కొనసాగిస్తున్నట్లు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు రైతులకు చేరువయ్యేలా కృషి చేస్తున్న ఎంపీఈవోల వ్యవస్థ నీరుగారే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి..



ఎంపీఈవోలను ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలి. పనితనాన్ని గుర్తించి సరైన న్యాయం చేయాలి. మార్చినుంచి అందాల్సిన వేతనాలు వెంటనే మంజూరు చేయాలి. పని భారం పెరిగింది ఆమేరకు వేతన సవరణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం చేపట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా 1,394 మంది, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 346 మంది ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. ● **జింకల ప్రసాద్, ఏపీఎంపీఈవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల**

వేతన బకాయిలు మంజూరు చేయాలి



ఎంపీఈవోలకు ప్రభుత్వం వేతన బకాయిలు వెంటనే మంజూరు చేయాలి. రైతులకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే ఎంపీఈవోలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. ఎంపీఈవోల వ్యవస్థను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి. పనికి తగ్గ వేతనాన్ని అందించి న్యాయం చేయాలి. ప్రభుత్వం ఎంపీఈవోల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేపడుతాం. ● **రామచంద్రుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నంద్యాల**

ఆరుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపెండేకల్లుకు చెందిన ఉప్పరి ప్రసాద్, తిమ్మప్ప, మల్లికార్జున, నాగరాజు, ఈరన్న, వీరేష్‌పై తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిని వీరు మద్యం మత్తులో దాడి చేశారని, అంతేకాకుండా మధుసూదన్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ మహిళను ఉప్పరి ప్రసాద్ కొన్నిరోజులుగా వేధిస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

- అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా
- డీఆర్వోకు వినతిపత్రం



కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రంలో మరో ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వం అక్రిడిటేషన్ మంజూరులో అసంబద్ధమైన నిర్ణయాలు, నిబంధనలు విధించడంతో 23వేల నుంచి 9 వేలకు అక్రిడిటేషన్లు కుదించారన్నారు. తాము అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్లు ఇస్తామని కూటమి పార్టీల నేతలు చెప్పారని, ఏడాదిన్నర దాటినా ఇంతవరకు కొత్త అక్రిడిటేషన్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల హామీలో భాగంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్ రాష్ట్రాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పించన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.వి. సుబ్బయ్య, గౌరవ సలహాదారు వై.వి.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ.ఎన్.రాజు, కె. శ్రీనివాస గౌడ్, కోశాధికారి అంజి, నాయకులు దస్తగిరి, శివరాజ్‌కుమార్, అవినాష్, రామయ్య పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఆదోని రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తుంబళం గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు దబ్బు నరసయ్యను అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు. వివరాల మేరకు.. నిందితుడు మంగళవారం కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తుండగా, గ్రామ శివార్లలో అదుపులో తీసుకుని, 100 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యాన్ని విక్రయించేవాడు. ఇప్పటికే పదుల సంఖ్యలో కర్ణాటక మద్యం కేసులు నమోదైనట్లు సమాచారం. పోలీసులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సాధికారతపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వం వంటి అంశాలపై మంగళవారం ఢిల్లీలో విస్తృత స్థాయి సమీక్షా జరిగినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బ్రిటీష్ హై కమిషనర్ క్రిస్టినా స్కాట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి యూకే హౌస్ ఆఫ్ కామన్స్ డిప్యూటీ స్పీకర్ నుస్రత్ ఘనీనీ ఆహ్వానించామన్నారు. జనస్వామ్య సహకారం, మహిళల నాయకత్వ అంశాలపై చర్చించుకున్నట్లు ఆమె తెలిపారు.

భర్త కనిపించడంలేదని ఫిర్యాదు



పెద్దన్న (ఫైల్)

బండిఆత్మకూరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవ ళాపురం గ్రామ సర్పంచ్ పెద్దన్న కనిపించడం లేదని అతని భార్య పార్వతి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ మంగళవారం రాత్రి తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, ఇప్పటి వరకు తిరిగి రాలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వామ్మో చిరుత!

- బెల్లందొడ్డి గ్రామంలో కలకలం

దేవనకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):



బెల్లందొడ్డి పొలంలో కనిపించిన చిరుత

మండలంలోని బెల్లందొడ్డి గ్రామ సమీప పొలాల్లో చిరుత కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిళ్లు పొలాల్లో సంచరిస్తుండటంతో కొందరు వీడియో తీశారు. అటవీ, పోలీసు అధికారులు చిరుత పాద ముద్రలను సేకరించారు. చిరుతని గుర్తించడం కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రిళ్లు పొలాలకు నీళ్లు కట్టేందుకు రైతులు వెళ్లవద్దని అటవీ అధికారులు సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన యువకుడు మంగళవారం మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంతోష్‌కుమార్(22) ఆరు నెలల క్రితం శ్రీనివాస క్రషర్ మిషన్‌లో పనిలోకి చేరాడు. వెల్డింగ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు

మాట ఇచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం

- 'సూపర్ సిక్స్' అమలు చేస్తున్నాం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం గూడెంకొట్టాల వాసులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం అశోక్‌నగర్ పంప్‌హౌస్ ప్రాంతంలో గూడెం కొట్టాలలో అత్యంత ఖరీదైన ఒక ఎకరం స్థలంలో 150 మందికి జీవో.నెం.30 ప్రకారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రిజిస్టర్ పట్టాలను వారిపేరు మీద అందజేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఈ జీవో.నెం.30ని జనవరి 2025లో ఇచ్చిన ప్రకారం మొదటి సారి మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరిలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, రెండో సారి కర్నూలులో ఇళ్ల పట్టాలు ఇచ్చి రికార్డ్ సృష్టించామన్నారు. దీనిని ఇంత త్వరగా కార్యరూపంలో పెట్టడం వెనుక జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, తహసీల్దార్ల కృషి ఉందని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఆగస్టు 15న మహిళలందరికీ రాష్ట్రమంతటా తిరిగే వెసులుబాటుతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ జీవో.నెం.30 వచ్చినప్పటి నుంచి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ 40 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న గూడెం కొట్టాల వాసులకు పట్టాలు ఇచ్చేలా కృషి చేశారన్నారు. రేపటి నుంచి ఆ స్థలాలు మీ సొంతమని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో జేసీ బి.నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు గూడెం రాజశేఖర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి


ఆర్డీవో నాగజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఆత్మకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సైపుద్దీన్, జిల్లా నాయకులు రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలు కావస్తున్నా.. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రతి మూడు నెలలకు ఓసారి అక్రిడిటేషన్లను పొడగిస్తున్నారే తప్ప కొత్తవి మంజూరు చేయడంలో జాప్యం వహించడం సరికాదన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సుబ్బారెడ్డి, సురేష్, వాహీద్, సల్మాన్‌ఖాన్, శ్రీను ఉన్నారు.

మహానంది: జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు కోరారు. మంగళవారం జర్నలిస్టు డిమాండ్స్ డే పురస్కరించుకొని మహానంది రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మధుసూదన్‌గౌడ్, మండల నాయకులు గంగిశెట్టి జనార్దన్‌రావు, శంకర్, వెంకటేశ్వర్లు, భానుముక్కల సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి పోటీలు

ఆత్మకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడామాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జరిగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా స్థాయిలో పది క్రీడాంశాలకు సంబంధించి పోటీలను నిర్వహించనున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, బాక్సింగ్ క్రీడలకు సంబంధించి జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో 22 ఏళ్లలోపు క్రీడాకారులు పాల్గొనవచ్చునని చెప్పారు. పోటీల్లో గెలిచిన వారికి 11 నుంచి 14వ తేదీ వరకు తిరుపతిలో జోనల్ పోటీల్లో, ఈ పోటీల్లో గెలిచిన వారికి 16 నుంచి 20వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఎంఎస్‌వీ.రాజు, 8712622576లను సంప్రదించాలన్నారు.

ఆత్మకూరులో పార్కులను ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో ప్రజలకు మానసిక ఆనందాన్ని కలిగించేలా పార్కులను, ఉద్యానవనాలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌లకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ 2011లో నగర పంచాయతీ హోదా దక్కించుకుని ఆతర్వాత గ్రేడ్-3 మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని అన్నారు. అయినప్పటికీ చిన్నపార్కు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఆత్మకూరు పట్టణంలో పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, మహ్మద్, గణపతి, సామేలు ఉన్నారు.

పగిడ్యాలలో వర్షం కోసం పూజలు


శివాలయం వద్ద పూజలు చేసేందుకు వచ్చిన గ్రామస్థులు

పగిడ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాలలో రైతుకమిటి, గ్రామస్థుల ఆధ్వర్యంలో వర్షం కోసం మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని పలు ఆలయాలకు భాజాభజం త్రీలతో నీటిబిందెలతో అభిషేకం చేశారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా వర్షాలు లేక వేసిన పంటలన్నీ ఎండుతున్నాయన్నారు. వర్షాలు కురవాలని దేవుళ్లను వేడుకుంటున్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు తాపాలి

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు తాపాలని అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఎనిమిదో వార్డు మహిళా పోలీసు పావని పేర్కొన్నారు. నంద్యాల ఉప్పరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ త్రివేణి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముర్రుపాలు తాగడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

పాణ్యం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి పేర్కొన్నారు. మంగళవారం కౌలూరులో ఘనవ్యర్థాల నిర్వహణపై ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని చెత్తను సమీకరించి వేరువేరుగా తడి, పొడి చెత్తలను తయారు చేసి సంపదను సృష్టించుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామస్తులు ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబు, సర్పంచ్ ఊడల బాలయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ భాస్కరరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, డీపీఆర్‌సీ బృందం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.


నంద్యాలలో ఎస్‌ఈకి వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


నందికొట్కూరులో విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహులు అధ్యక్షతన నంద్యాలలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఎస్ఈ సుధాకర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఎలాంటి జీవో తీసుకురాలేదని విద్యుత్ అధికారులు కూడా ఏమీ చెప్పడం లేదన్నారు. మేము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చెప్పిన మాట నేడు ఏమైందన్నారు. మాకు స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్ల కావాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, అలాగే విద్యుత్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, వెల్ఫేర్ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అన్సర్‌బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్వైడీ ప్రసాద్, క్రిస్టియన్ జేఏసీ తెలుగు ఉభయ రాష్ట్రాల కన్వీనర్ మన్యం జానయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: ప్రమాదకరస్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు ఏడీఈ కార్యాలయం ముందు సీఐటీయూ, వ్యవసాయకార్మిక సంఘం, కేయూపీఎస్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌మీటర్లను బిగించడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని నాడు లోకేశ్ చెప్పిన మాటలే నేడు ప్రజలు పాటించాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, డివైఎఫ్ఐ నాయకులు ఉస్మాన్ బాషా, దూదేకుల బాబు, జయరాణి, కొంగర వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, డేవిడ్, పాండు, రామసుబ్బయ్య, కలాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: స్మార్ట్‌మీటర్ల విధానానికి వ్యతిరేకంగా పగిడ్యాల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్, సీపీఎం మండల కన్వీనరు పక్కీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, ఉసేనమ్మ, కలాంబాషా, చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని సీపీఎం, సీపీఐ నాయకులు కర్ల, రమేష్‌బాబు అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లాలోని విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ధర్నా చేపట్టారు.

గోస్పాడు: స్మార్ట్‌మీటర్లు బిగించడం ఆపాలని సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గోస్పాడు సబ్ స్టేషన్‌వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలాని బాషా, సీపీఐ నాయకులు మౌల, నాగరాజు, నరసింహ, సుంకన్న, మద్దిలేటి, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే విరమించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్,పట్టణ పౌర సమాఖ్య నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లను ఇళ్లకు బిగించొద్దు అని మండలంలోని నల్లకాలువ గ్రామంలో స్మార్ట్ మీటర్ల పోరుబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామ్‌నాయక్, వీరన్న, వెంకటేశ్వర్లు, మాబాషా, ఆశీర్వాదం,రాముడు, కృష్ణమోహన్ ఉన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వరిలో ఎరువులను మోతాదుకు మించి వాడరాదని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకు చెన్నయ్య సూచించారు. మంగళవారం చాబోలు గ్రామంలో ఏవో వరప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిమడులలో జింక్‌లోప నివారణకు 2 గ్రాములు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. అలాగే 5 సెంట్ల నారు మడిలో 2కేజీల నత్రజని ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను వేయాలని తెలిపారు. ఏవో ప్రసాదరావ్ మాట్లాడుతూ కైలు రైతులందరూ పంట సాగు పత్రాలు కలిగి ఉండాలని, సంబంధించిన పత్రాలను గ్రామ రెవెన్యూ ద్వారా పొందాలని సూచించారు.

వైభవంగా బిషప్ ప్రమాణస్వీకారం

- నంద్యాల డయాసిస్ బిషప్‌గా రెవరెండ్ సంతోషి ప్రసన్నరావు


నంద్యాల డయాసిస్ బిషప్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సంతోషి ప్రసన్నరావు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నికైన రెవరెండ్ సంతోషి ప్రసన్న రావు ప్రమాణస్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. నంద్యాల హోలీక్రాస్‌కెథడ్రిల్ చర్చిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం మాడరేటర్ రూబెన్‌మార్క్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2024 ఏప్రిల్‌లో నంద్యాల డయాసిస్ అధ్యక్ష మండలపు పీఠాధిపతి ఎంపికకు జరిగిన ఎన్నికల్లో అర్హత సాధించిన రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావును చెన్నైలోని సినాడ్ అధికారులు ఎంపిక చేయడం జరిగిందని జనరల్ సెక్రటరీ పెర్నాండెజ్ అన్నారు. ఈకార్యక్రమానికి నంద్యాల డయాసిస్ పరిధిలోని నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప, ప్రకాశం, జిల్లాలో పనిచేస్తున్న చర్చిపాదర్‌లు, క్రైస్తవులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాయలసీమ బిషప్ ఐజక్ వరప్రసాద్, కృష్ణ గోదావరి బిషప్ జార్జికార్నేలియస్, డోర్నకల్ బిషప్ పద్మారావు, కోయంబత్తూర్ బిషప్ తిమోతిరవీందర్, కర్ణాటక సెంట్రల్ బిషప్ హేమచంద్రకుమార్, మధురై బిషప్ జయసింగ్ ప్రిన్స్ ప్రభాకరన్ పాల్గొన్నారు.

రహదారిపై చెత్త తొలగింపు


కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

పాణ్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డుగండ్ల, రసూల్లపేట గ్రామాల మధ్యలోని వాగు ప్రధాన రహదారిపై అడ్డుగా మారిన కంప చెట్లు, చెత్తను టీడీపీ నాయకుడు శివశంకరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. వర్షం వస్తే ఈరెండు గ్రామాల మధ్య వాగుకు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో తొలగించారు.

బనకచెర్లను సందర్శించిన నాయకులు


మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

పాములపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్‌ను మంగళవారం ఆలోచనాపరుల వేదిక కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆలోచనాపరుల వేదిక నాయకులు విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, రాయలసీమ సాగునీటి సాధనసమితి బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజక్టుల వివరాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం విషం చిమ్ముతోందని ఆరోపించారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణ సాగునీటి రంగం విశ్లేషకులు, రైతుసేవా సమితి అధ్యక్షులు అక్కినేని భవానిప్రసాద్, సామాజికవేత్త జొన్నలగడ్డ రామరావు, సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి రంగయ్య నాయుడు, ఉత్తరాంధ్ర సాగునీటి హక్కుల సాధన సమితి అధ్యక్షుడు క్రిష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 05(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మంగళవారం భక్తులు, స్థానికుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలోని చంద్రావతి కల్యాణమండపంలో నిర్వహిస్తున్న ఈ యోగా శిక్షణను ప్రముఖ యోగాగురువు యోగాచార్య ఒంగోలు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం బృందంచే శిక్షణను ఇస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సూక్ష్మవ్యాయామం, తరువాత సూర్యనమస్కారాలు యోగాచార్యులు సాధకులు చేయిస్తున్నారు. ఆగమపాఠశాల విద్యార్థులు, శివసేవకులు, యోగా శిక్షణలో పాల్గొన్నారు.

నేడు ఆలయ పునః ప్రతిష్ఠ

వెలుగోడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి పెనుగొండ క్షేత్రం పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతితో పాటు పలువురు ఆర్యవైశ్య రాష్ట్ర జిల్లా నాయకులు, ప్రముఖులు హాజరు అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శిలాఫలకం వివాదం

వెలుగోడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ప్రతిష్ఠ శిలాఫలకం వివాదానికి దారి తీసింది. ఆలయాని నిర్మాణానికి పలువురు ఆర్యవైశ్య దాతలు విరాళాలు అంద జేశారు. ఈ ఆలయానికి అధ్యక్షులకు మూడేళ్ల పాటు పదవీకాలం ఉం టుంది. అయితే చాలామంది విరాళాలు ఇచ్చారు. వారి పేర్లను గోడలపై రాయించారు. అయితే ఆలయ అధ్యక్షుడు సుధాకర్ తన కుటుంబ సభ్యులతో కూడిన ఫొటోలు, వివరాలతో శిలాఫలకం ఏర్పాటు చేయడంతో పలువురు వాగ్వాదానికి దిగారు. శిలాఫలకం ఏర్పాటు చేస్తామంటే మేముకూడా అదనంగా డబ్బులు ఇచ్చేవారమని ఇలా ఎవరికి చెప్పకుండా శిలాఫలకాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం


విద్యార్థికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేయడానికి ముందుకు వచ్చిన ఉపాధ్యాయ దంపతులను కలెక్టర్ రాజకుమారి అభినందించారు. నంద్యాల పట్టణం క్రాంతినగర్‌కు చెందిన రోహన సాయి పాలిటెక్నిక్ డిప్లొమాలో 95 శాతం సాధించాడు. 2025 ఎంసెట్ రాయగా విజయనగరం జిల్లా ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత సీటుపొందాడు. అక్కడ హాస్టల్‌లో ఉండడానికి వార్షికంగా రూ.50 వేలు కట్టాలి. కాని అతని కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉండడంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న అదే కాలనీకి చెందిన ప్రధానోపాధ్యాయులు సాంబశివుడు, ఉపాధ్యాయురాలు శివకుమారి దంపతులు విద్యార్థికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ కుటుంబాన్ని వారు పీ4 కార్యక్రమం ద్వారా దత్తత తీసుకున్నారు. విద్యార్థికి బీటెక్ పూర్తయ్యేవరకు తాము అండగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా రాజకుమారి గణియా ఉపాధ్యాయులను కలెక్టర్ కార్యాలయానికి పిలుపించుకుని వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకుని బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మరింత మంది ముందుకు రావాలని కోరారు.

'నాగటూరు' ద్వారా నీటి విడుదల చేయాలి


మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎండుతున్న పంటలకు నాగటూరు ఎత్తిపోతల ఫేజ్-1, ఫేజ్-2 నుంచి నీటి విడుదల చేసి కాపాడాలని సీపీఎం నాయకులు ఫక్కీర్ సాహెబ్, రైతులు కోరారు. మంగళవారం నందికొట్కూరు శివారులోని మొక్కజొన్న పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. గత రెండు నెలల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ ఎండుతున్నాయన్నారు. నాగటూరు ఎత్తిపోతల పథకం మోటార్లు, ట్రాన్స్‌పార్మర్లను ఇక్కడి నుంచి వేరే చోటికి తరలించడం జరిగిందన్నారు. వాటిని తిరిగి తీసుకోకరాకపోవడంతో నీటి విడుదల ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ఇరువురు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారే తప్పా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాండు, గంగాధర్; మహబూబ్‌బాషా, నరసింహులు, శ్రీనివాసులు, పుల్లన్న, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా పార్థసారథిరెడ్డి

కొత్తపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్‌గా పార్థసారథిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో ఎస్‌బీఐ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లికి వచ్చారు. ఇక్కడ ఎస్‌బీఐ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పవన్ కుమార్ డోన్‌కు ఎస్‌బీఐకి బదిలీపై వెళ్లారు. మేనేజర్ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకున్న అన్ని రకాల ఖాతాదారులు సక్రమంగా రుణాలు చెల్లిస్తూ బ్యాంకుకు సహకరిస్తే మరింత అదనపు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు.

న్యాయం చేయండి

కొత్తపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తాము 30 ఏళ్లకు పైగా వ్యవసాయ సాగులో ఉన్నాం. కొందరు తమకు తెలియకుండా ఆన్‌లైన్ ఎక్కించుకున్నారని గుమ్మడాపురం రైతులు మంగళవారం తహసీల్దార్ ఎదుట వాపోయారు. గుమ్మడాపురం పొలిమేరల్లో 68 మంది రైతులకు చెందిన సర్వే.నెం.453 హెచ్‌లో 160 ఎకరాలు, 453 ఐలో 47 ఎకరాల భూమిని ముసలిమడుగు, సింగరాజుపల్లి, గుమ్మడాపురం గ్రామాలకు చెందిన 39 మంది రైతులు గతంలో పని చేసిన తహసీల్దార్, వీఆర్వోల సహకారంతో అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్న భూములను రద్దుచేసి సాగులో ఉన్న రైతులకు ఆన్‌లైన్ చేయాలని రైతులు కోరారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా తెలిపారు. శనివారం నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. అలాగే మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు గత మూడు నెలలకు సంబంధించిన నివేదికలుతో రావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలాం బాషా కోరారు.

మహాసభలకు తరలిరావాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మహానంది, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోవాలో 7న జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 10 మహాసభలకు బీసీలు తరలిరావాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మహానంది మండలం బోయలకుంట్ల మెట్ట వద్ద ఆయన బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలో బీసీల సమస్యలపై చర్చిస్తామన్నారు. అనంతరం మహాసభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, అధికార ప్రతినిధి శ్రీను, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణగౌడు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలి: మాజీ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలను ప్రతి ఇంటికెళ్లి వివరించాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణం నడిగడ్డలోని కన్యాకపరమేశ్వరి పాఠశాలలో 1,2,3,5 వార్డులకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అలివిగాని హామీలిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో సైతం ఎరువులు సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అరకొరగా సరఫరా చేసిన యూరియాను కూడా కూటమి నేతలే గోదాములలో దాచుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులకు కూడా పథకాలు అందించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ వ్యవహార శైలిని ఎండగట్టడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త, నాయకులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే వైసీపీ దుష్ప్రచారం


మాట్లాడుతున్న హరిబాబు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వారానికి ఒకసారి నియోజకవర్గానికి వచ్చే మాజీ ఎమ్మెల్యే జిల్లాలో ఎరువుల కొరత అంటూ దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు దుయ్యబట్టారు. మార్కెట్ యార్డు కార్యాలయంలో మంగళవారం చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వ్యవసాయాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారని, జిల్లాకు అవసరం మేరకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సోమవారం కూడా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడుతో మంత్రి ఫరూక్ సంప్రదించి జిల్లాకు యూరియా కేటాయింపు మరింత పెంచాలని కోరడం జరిగిందని, వెంటనే అధికారులను కూడా వ్యవసాయశాఖ మంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలో అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఆందోళన వద్దని రైతులను కోరారు. రైతులను వైసీపీ నాయకులు పెడదోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు.

కూటమి ప్రభుత్వం చేస్తున్న..


గోస్పాడులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోస్పాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ ఓర్వకలేక చౌకబారు ఆరోపణలు చేస్తోందని జిల్లెల్ల టీడీపీ నాయకులు సదాశివారెడ్డి, చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లెల్ల గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మండలంలో యూరియా, డీఏపీ టీడీపీ నాయకులే తీసుకుంటున్నారని వైసీపీ వారికి ఇవ్వడంలేదని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో వాస్తవం లేదన్నారు. జిల్లెల్ల గ్రామానికి 1600యూరియా బస్తాలు, 1800డీఏపీ బస్తాలు వచ్చాయని, ఇవి ఏ రైతులకు అందించామో పక్కా లెక్కలు ఉన్నాయన్నారు. గోస్పాడు మండలంలో ఎక్కడాకూడా అవకతవకలు జరగకుండా మంత్రి ఎన్ఎండి ఫరూక్ పర్యవేక్షిస్తూ రైతులకు కావాల్సిన పనిముట్లు, ఎరువులను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు పంజుగల చంద్రశేఖరరెడ్డి, సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, బాలుడు, సుబ్బారావు, సయ్యద్‌గౌస్‌పీరా, భూషణంరెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్నపై రైతుల మక్కువ

- ముందస్తు వర్షాలే కారణం
- సాధారణం కంటే అధికంగా..
- 6,500 హెక్టార్లలో సాగు

చాగలమర్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కంటే ముందే వానలు కురిశాయి. ముఖ్యంగా మేలో 70 శాతం అధిక వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ పనులు ముందే ప్రారంభించారు. జూన్‌లోనే పర్వాలేదనే స్థాయిలో వర్షాలు కురిశాయి. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో మొక్కజొన్నపై రైతులు మక్కువ చూపించారు. 6,500 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. ఖరీఫ్‌లో సాధారణ సాగు 7,059 హెక్టార్లు కాగా ప్రస్తు తం 8,200 హెక్టార్ల లో సాగు చేపట్టారు. తక్కు వ పంట కాలం, గిట్టుబాటు ధర ఉండటం, సులభ వ్యవసాయం పద్ధతుల కారణంగా ఈ ఏడాది కూడా రైతులు మొక్కజొన్న సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని చాగలమర్రిలో 1,028 హెక్టార్లు, ఆళ్లగడ్డలో 1658 హెక్టార్లు, రుద్రవరం 3,225 హెక్టార్లు, శిరివెళ్ల 350 హెక్టార్లు, ఉయ్యాలవాడ 198 హెక్టార్లు, దొర్నిపాడు 25 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పసుపు, మిరప పంటలను తగ్గిం చి మొక్క జొన్నపై దృష్టి సారించారు.



చాగలమర్రిలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న



మొక్కజొన్నలో ఎరువులు చల్లుతున్న మహిళా కూలీలు

రంగంలోకి ప్రైవేటు కంపెనీలు

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో చాగలమర్రి, ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల పరిధిలో ఈ ఏడాది కమర్షియల్‌తో పాటు సీడు మొక్కజొన్న కూడా సాగుచేస్తున్నారు. చాగల మర్రిలో 250 ఎకరాలు, ఆళ్లగడ్డలో 300, రుద్రవరంలో 450 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు రైతులకు ముందస్తుగానే పెట్టుబడి కింద చెల్లింపులు ఇచ్చి పంట పండిన తరువాత మొక్కజొన్న విత్తనాన్ని రైతుల వద్ద నుంచి నేరుగా కొనేలా ఒప్పందం కుదుర్చుకు న్నారు. పంట పండితే క్వింటా రూ.2,700 చొ ప్పున కొనుగోలు చేస్తా రు. పంట రాకుంటే ఎక రాకు రూ.60 వేలు ఇచ్చే లా ఒప్పందం కుదుర్చు కున్నారు. పండిన, పండకున్న లాభం వస్తుందన్న ఆశతో చాలా మంది రైతులు ఈ ఏడాది ప్రైవేటు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మరి కొందరు రైతులు కంపెనీల ఒప్పందం లేకుండానే ధర అధికంగా ఉండటంతో మొక్కజొన్న సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు.

ప్రతిపాదనలను విరమించుకోవాలి

- సీపీఐ మండల కార్యదర్శి శివయ్య
- స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

బనగానపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదనలను విరమించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో బనగానపల్లె విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ శ్రీనివాసు లుకు వినతిపత్రం సమర్పించారు. శివయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొడతామని ఇప్పటి విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ అన్నారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా విద్యుత్ చార్జీల భారం మోయలేని అప్పట్లో టీడీపీ నాయకులు గగ్గోలు పెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు, పెంచిన చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఎర్రిస్వామి, శివనాగయ్య, ఖాదర్, నాగాంజినేయులు, చందు, మాదన్, రాజ్ పాల్గొన్నారు.



బనగానపల్లె విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



కొలిమిగుండ్లలో..

డోన్ రూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను వ్యతిరేకిస్తూ సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. సీపీఐ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్ కో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల కార్యదర్శి నారాయణ, పుల్లయ్య, అబ్బాస్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: సామాన్య ప్రజల నడ్డి విరిచే స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద సీపీఐ కార్యదర్శి సూర్యనారాయణ, మహేష్, శ్రీరంగ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణస్వామికి వినతిపత్రం అందజేశారు. నరేష్, భూపాల్, సురేష్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఏఈ అనంతరావుకు వినతిపత్రం అందించారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సుధాకర్, బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు దేవరాజు, త్యాగరాజు, సుబ్బారెడ్డి, మురళి,పాల్గొన్నారు.

ప్యాపిలి: గృహ వినియోగదారులకు భారంగా మారిన స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చిన్నరహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జలదుర్గం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో ప్యాపిలి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు జలదుర్గం రసూల్, వెంకటేష్, మహేష్, రామక్రిష్ణ, చాంద్‌పీరా పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించి ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భార్గవ్, మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళవారం డోన్ రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ నాయకులు, ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి విద్యుత్ రూరల్ ఏఈ శ్రీని వాసులుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉదయ్, నాగేశ్వరరావు, సోమన్న, శ్రీరాములు, తిమ్మయ్య, రామదాసు, శంకర్, ధనుంజయ, బాలు, బుజ్జి, ప్రదీప్, మధు, ఎల్ల కృష్ణ, ఖాదిర్, ఫారూక్, అస్లాం, సంతోష్, జ్ఞానేశ్వర్, రజాక్, శ్రీమన్నారాయణ, భాస్కర్, కార్తీక్, సాయి, రవి పాల్గొన్నారు.



డోన్‌లో..



బేతంచెర్లలో..



స్మార్ట్ మీటర్లను పగులకొట్టి ఆందోళన

డోన్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని డీఈ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను పగులకొట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు, శివరాం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

డోన్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శనీశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎస్ఆర్ వైన్స్ వైరాజుగౌడు, డోన్ సింగిల్ విండో చైర్మన్ వై.ఎల్లాగౌడు రూ.1,11,111లు నగదు విరాళాన్ని మంగళ వారం అర్చకులు విహారీ స్వామికి అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.



విరాళం ఇస్తున్న దాతలు

ఏపీవోగా రవిప్రకాష్

సంజామల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఏపీవోగా రవి ప్రకాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జయంతి బదిలీపై వెళ్లడంతో ఏపీవోగా రవిప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పిస్తానన్నారు.



ఎంఈవోల నియామకంలో వివక్షత తగదు

డోన్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎంఈవోల నియామకంలో వివక్షత తగదని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బీవై సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు ఎన్ఎస్ బాబు, ఎం.సుభాన్, లక్ష్మీనాయక్, గోపాల్, సుమన్, ప్రసాద్, హుశేన్‌బాషా, శివుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

డోన్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ సబ్‌స్టేషన్ పరిధిలో మిద్దెపల్లె, అనుంపల్లి, రేగులకుంట గ్రామాలకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ డిప్యూటీ ఈఈ నాగేంద్ర, నాగేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విద్యుత్ ఇస్తామన్నారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

బనగానపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం పలుకూరులో అంగన్‌వాడీ కేంద్రంలో గోర్లగుట్ట బుగ్గ రామేశ్వరస్వామి భజన మండలి సహకారంతో అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. టీచర్లు రమణమ్మ, స్వవంతి, కమల్లమ్మ, శ్రీదేవి, మాబున్నీ, తల్లులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

కొలిమిగుండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజరు శివమ్మ అన్నారు. కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్-3లో టీచర్ పోరెడ్డి అనిత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహిం చారు. గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల యొక్క ఆవశ్యకతను సూపర్‌వైజర్ శివమ్మ వివరించారు. ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమామహేశ్వరి, రోజారాణి, ప్రమీల, ఆయా కమల పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజరు శివమ్మ

చాగలమర్రి: తల్లిపాలు చిన్నారులకు సంజీవని లాంటివని వైద్యుడు ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం అన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో విజయభారతి, ఎంఎల్‌హెచ్‌పీ విష్ణుప్రియ, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడీ వర్కర్ పద్మావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చాగలమర్రిలో మాట్లాడుతున్న వైద్యుడు ఇమ్రాన్



రుద్రవరంలో ర్యాలీ చేస్తున్న సీడీపీవో అంగన్‌వాడీ కార్యకర్తలు

రుద్రవరం: తల్లిపాలు బిడ్డకు వరమని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో తేజేశ్వరి అన్నారు. మంగళవారం రుద్రవరంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టాలన్నారు. బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినుల పొలం బాట



క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

రుద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినులు పొలంబాట పట్టారు. వ్యవసాయ క్షేత్ర సందర్శనలో భాగంగా రుద్రవరం సమీపంలోని పంట పొలాల్లో విద్యార్థినులు వరి నాట్లు వేశారు. మడిలో నాటు ఎలా వేయాలి, పంట సాగులో ఎరువులు ఎలా ఉపయోగించాలనే వాటిపై వివరించారు. రైతులకు ఏఏ పంటలు పండిస్తున్నారో విద్యార్థినులు తెలుసుకున్నారు. వ్యవసాయంపై ఆసక్తి పెరిగేలా చేయడం తల్లిదండ్రులు ఎలా కష్టపడుతున్నారో విద్యార్థులకు తెలియాల్సి ఉందని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, అగ్రికల్చరల్ ట్రైనరు జ్యోతిప్రియ పాల్గొన్నారు.

దెబ్బతిన్న మినుము పంట

రుద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. ఈవర్షం ధాటికి పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల పరిధిలో సాగు చేసిన మినుము పంట దెబ్బతింది. అలాగే కోత కోసిన మినుములు రహదారులపై ఆరబోశారు. వర్షానికి తడిచిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఆళ్లగడ్డ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి హామీ పథకం పనుల చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీడీ సాంబశివరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ సహాయంతో ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని గుర్తించడం, ఫేస్ ఇడెంటిఫికేషన్, మస్టర్లపై జరిగే అవకతవకల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏఐ ట్యాబ్‌ను వినియోగిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో నూర్జహాన్, ఏపీవోలు, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల, ఆశావర్కర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి సుబ్బయ్య అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లపై కొత్తకొత్త యాప్‌లతో పనిభారాన్ని పెంచుతోందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు పెంచాలని, పనిభారాన్ని తగ్గించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేవనూరులో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

కోవెలకుంట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడికర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రేవనూరు శివాలయంలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ధర్మ ప్రచారకులు జయానందస్వామి మాట్లాడుతూ భగవంతుడి శ్రవణం మానవులను దుఃఖ రహితులను చేసి ఉత్తమగతులను ప్రాప్తింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, భజన మండలిసభ్యులు వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరాంరెడ్డి, హనుమంత్‌రెడ్డి, హుసేనయ్య, నాగమల్లేశ్వర్‌రెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆళ్లగడ్డ ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యాసరచన, క్విజ్, డిబేట్, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనపరచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగన్న తెలిపారు. మంగళవారం ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభి నందించి ఆర్థిక సహాయం చేశారు. ఈనెల 6న కడపలో జోనల్‌స్థాయి పోటీల్లో విద్యార్థులు కే మదన్, రూన్సీ పాల్గొంటారన్నారు.

బయట కనిపిస్తే గోశాలలకు తరలిస్తాం

బేతంచెర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆవులు బయట కనిపిస్తే గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆవులు, పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో దుకాణాలు, రోడ్లపై విచ్చలవిడిగా ఆవులు, పందులు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో రైతు సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ పందులు పంట పొలాలను నాశనం చేస్తున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమంత్ కుమార్ రెడ్డి పారశ్రామికవేత్త శ్రీధర్ రెడ్డి, పాల్గొన్నారు.

టీ తాగుతూ వినూత్న నిరసన

డోన్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీ తాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే.చంద్రశేఖర్, సునీల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, క్రిష్ణ, కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన సుబ్బారెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్‌ను వైజాగ్‌లో మంగళ వారం రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా క లిశారు. పల్లా శ్రీనివాసరావును శాలువతో సత్కరించారు. అనం తరం పలు సమస్యలపై ఆయన చర్చించారు.



బొకే అందిస్తున్న సుబ్బారెడ్డి

బాలసదన్ తనిఖీ

ఆళ్లగడ్డ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదన్ ను మంగళవారం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అలాగే వివిధ రికార్డులను పరిశీలించి సూపరిండెంట్ జ్యోతి విద్యార్థుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బారతి, సరస్వతి, హరిలక్ష్మి పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

రెండు రోజుల్లో 50.6 మి.మీ., వర్షపాతం నమోదు

కొలిమిగుండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా రెండు రోజుల్లో 50.6మి.మీ వర్షపాతం నమోదైనట్లు మండల ఏఎస్ఓ భాస్కరరెడ్డి వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పంట పొలాల్లో పదును అయినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే తప్ప పూర్తిస్థాయి ఉపశమనం లభించే అవకాశం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

పత్తి సాగులో మెలకువలు పాటించండి

కొలిమిగుండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పత్తి సాగులో మెలకువలు పాటించాలని కొలిమిగుండ్ల మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాదు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సాగులో సస్యరక్షణ చర్యలు, పంట నమోదు, తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో వనిత, వీపీఏ సందీప్, వీహెచ్‌ఏ బాషా, రైతులు పాల్గొన్నారు.

టీటీడీకి విరాళం

కోవెలకుంట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణానికి చెందిన టీచర్ నాగరాజు, వరలక్ష్మి దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదాన ట్రస్టు విరాళం ఇచ్చారు. మంగళవారం స్వామి వారిని దర్శించుకొని ఈవో వెంకయ్యచౌదరికి రూ.10 లక్షల డీడీని అందించినట్లు నాగరాజు తెలిపారు. అనంతరం ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళాన్ని ఇస్తున్న దంపతులు

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

ఆళ్లగడ్డ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను ప్రశాతంగా జరుపుకోవాలన్నారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈనెల 27న ఉత్సవాలు ప్రారంభమై 29న ని మర్జనంతో ముగుస్తాయన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నాని సీఐ హెచ్చరించారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ మురళీ ధర్ రెడ్డి

పందుల తరలింపునకు చర్యలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పందుల తరలింపునకు మున్సిపల్ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. కమిషనర్ కిశోర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, సిబ్బంది పట్టణంలోని పందులను పట్టి జనావాసాలకు దూరంగా తరలించారు. పలు వార్డు ల్లో 45 పందులను పట్టి దూరంగా తరలించినట్లు కమిషనర్ తెలిపారు.

సమాజసేవతోనే గుర్తింపు

శిరివెళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది సమాజంలో అందించే సేవలతోనే తగిన గుర్తింపు లభిస్తుందని వైద్యులు ముఖేష్, ఆంజనేయులు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శిరివెళ్ల పీహెచ్‌సీ నుంచి పలువురు వైద్య సిబ్బంది బదిలీపై వెళ్తుండడంతో వారిని మంగళవారం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ రవి కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరు రహదారిలో క్షుద్రపూజల కలకలం

శిరివెళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నూరు గ్రామ ప్రధాన రహదారిలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్ల కలకలం రేపాయి. దీబగుంట్ల గ్రామం నుంచి చెన్నూరుకు వెళ్లే రహదారిలో గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గులు వేసి, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారిపై ఇటీవల కాలంలో తరచూ ఇలాంటివి జరుగుతుండడంతో అటువైపు వెళ్లేందుకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఇంటింటికీ 'మనమిత్ర'



రుద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

రుద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అవగాహనపై ర్యాలీ నిర్వహించినట్లు డిప్యూటీ ఎం పీడీవో సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం రుద్రవరంలో విద్యా ర్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశా రు. సుమారు 700 సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ర్యాలీ నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు కలిసి మంగళవారం మనమిత్ర యాప్‌పై అవగాహన ర్యాలీ చేశారు. ఆయా పాఠశాలల్లో మనమిత్ర యాప్ నమోదు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఈవో తారకేశ్వరి, హెచ్ఎం జీవయ్య, మహిళా పోలీసులు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంజామల: ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసిందని ఇన్‌చార్జి ఎంపీడీవో రామసుబ్బయ్య అన్నారు. సంజామలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వ్యాయామ సంచాలకులు బాషా, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: డోన్ మున్సిపల్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో నరసింహులు, కమిషనర్ ప్రసాద్‌గౌడు ర్యాలీ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

చాగలమర్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు స్వమిత్వ సర్వేకు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటి కొలతలు, సరిహద్దులు, ఇతర వివరాలు సర్వే సిబ్బందికి తెలిపి సకాలంలో సర్వే పూర్తి చేయించుకోవాలని సూచించారు. హక్కు పత్రాలు ఇచ్చేందుకు ఈ సర్వే చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు స్వమిత్వ సర్వే గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.